సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 27 । మార్చి । 2023



ఆర్తులకు ఆప్తులు..

వాట్సాప్ మిత్రులంతా కలిశారు. సాటి వారికి సాయం చేసేందుకు నడుం బిగించారు. - 8లో



రైలు ఢీకొని..

విశాఖ ఎక్స్‌ప్రెస్ ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. నౌపడ రైల్వే గేటు సమీపంలో ఘటన జరిగింది. - 8లో

నేడే 104 వాహనాల ప్రారంభోత్సవం

అరసవల్లి: ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలులో భాగంగా జిల్లాకు కేటాయించిన 104 వాహనాల ప్రారంభోత్సవ కార్యక్రమం మంత్రి ధర్మాన ప్రసాదరావు క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం ఉదయం జరుగుతుందని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి తెలియజేశారు. జిల్లాకు రాష్ట్రంలోనే అధికంగా 25 వాహనాలను కేటాయించినట్లుగా ఆమె పేర్కొన్నారు.



పంట.. మారుతోందంట!

- ఈ ఏడాదంతా చిరుధాన్యాల కార్యకలాపాలు
- మిల్లెట్ల సాగు, వినియోగం పెంచడమే ప్రధాన లక్ష్యం
- జిల్లాలో 2500 ఎకరాల్లో చిరుధాన్యాల సాగు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాగిజావ మళ్లీ జనాల మెనూలోకి చేరింది. సజ్జ తిరిగి ఇంటి జాడీలో చోటు సంపాదించుకుంది. జొన్న అన్నింటి కంటే మిన్న అన్న గుర్తింపు సంపాదించుకుంది. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రజల ఆహార అలవాట్లు మెల్లగా పాతకాలం పద్ధతుల వైపు మళ్లుతున్నాయి. అందుకు అనుగుణంగా అన్నదాతల సాగు పద్ధతులు కూడా చిరు ధాన్యాల వైపు మళ్లించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అందుకు తగ్గ ప్రోత్సాహం కూడా అందిస్తోంది. జిల్లాలో చిరుధాన్యాలు పండించేందుకు రైతులకు, స్వయం సహాయక సంఘాలకు, విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. రైతులతో మిల్లెట్ క్లస్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.





రాగి పంటల పొలంలో అవగాహన కార్యక్రమంలో రైతులు, అధికారులు

సాగుకు ప్రోత్సాహం

జిల్లాలో 12 క్లస్టర్లలో 2500 ఎకరాల్లో చిరుధాన్యాలు పండించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక్కో హెక్టార్‌కి దిగుబడి 1500 కిలోలు వస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ ఏడాదంతా అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా గుర్తించిన నేపథ్యంలో ఆరోగ్యం, పోషక విలువలతో కూడిన చిరు ధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. వరి, గోధుమలకు ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలను ఆహారంగా తీసుకునేలా ప్రచారం చేస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా గార మండలంలో 2000 ఎకరాలు, జి.సిగడాం, కొత్తూరు, నందిగాం, కవిటి క్లస్టర్లలో 500 ఎకరాలకు పైగా పండించేందుకు స్వయం సహాయక సంఘాలు, విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తున్నారు. 12 క్లస్టర్లకు 40 శాతం సబ్సిడీతో ప్రాసెసింగ్ యూనిట్లు ఇచ్చేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. పండించిన చిరుధాన్యాలను మార్కెటింగ్ చేసుకునేలా నేచురల్ బాస్కెట్, శ్రేష్ఠ, బిగ్–బాస్కెట్, ఎన్‌జీఓలు ద్వారా సదుపాయాలు మెరుగుపరుస్తున్నారు. ప్రభుత్వం కూడా మద్దతు ధరకు కొనుగోలు చేసే యోచన చేస్తోంది.

రాయితీపై విత్తనాలు..

ఇప్పటికే గిరిజన ప్రాంతాల్లో 55 క్వింటాళ్లు, 90శాతం సబ్సిడీతో, గిరినేతర ప్రాంతాల్లో 500 కిలోల చిరుధాన్యాల విత్తనాలు అందించారు. ప్రతి సబ్ డివిజన్ పరిధిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో జరిగిన స్పందనలో ఉచితంగా 500 మందికి రాగిమాల్ట్ అందించారు. ప్రభుత్వం నిర్వహించే సమావేశాల్లో మిల్లెట్స్‌తో తయారుచేసిన బిస్కెట్లనే పంపిణీ చేస్తున్నారు. భవిష్యత్‌లో ప్రతి ఒక్కరూ ఈ రకమైన బిస్కెట్లు రెగ్యులర్ తినుబండారాలుగా అలవాటు చేసుకునేలా చూడాలని ప్రజలకు సూచిస్తున్నారు.

దిగుబడి పెంచేలా ప్రణాళిక



తృణధాన్యాల ఉత్పత్తి పెంచడానికి జాతీయ ఆహార భద్రతా మిషన్ కింద 12 క్లస్టర్లలో చర్యలు చేపట్టి పండించేందుకు తగిన ఏర్పాట్లు పూర్తిచేశారు. క్లస్టర్ ప్రదర్శనలతో పాటు పంటల విధానంపై అవగాహన కల్పించడం, అధిక దిగుబడి ఇచ్చే హైబ్రీడ్ విత్తనాల పంపిణీ, వ్యవసాయ యంత్రాలు, ఉపకరణాలను రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుంది. అవగాహన పెంపొందిస్తూ రైతులతో జిల్లాలవారీగా మిలెట్ క్లస్టర్లు, వర్చువల్ విధానంలో క్లాస్‌లు నిర్వహించాలని నిర్ణయించింది.



సాగు పెంచడమే లక్ష్యం



జిల్లావ్యాప్తంగా వరి, అపరాలతో పాటు రాగులు, జొన్నలు, సజ్జలు, తృణధాన్యాలు పండించేందుకు కావాల్సిన అన్ని సౌకర్యాలు రైతులకు అందిస్తున్నాం. క్లస్టర్లు ఏర్పాటు చేశాం. వాటి ద్వారా సాగు యంత్రాలు, విత్తనాలు రాయితీపై అందిస్తున్నాం. జిల్లాలో చిరుధాన్యాలు పండించేందుకు ఏ రైతు ముందుకొచ్చినా సహకారం అందిస్తాం. ప్రభుత్వ సమావేశాల్లో మిల్లెట్‌తో తయారుచేసిన బిస్కెట్లనే పంపిణీ చేస్తున్నాం.

– కె.శ్రీధర్, జిల్లా వ్యవసాయాధికారి, శ్రీకాకుళం

ఊబకాయం వంటివి తగ్గుతాయి



చిరుధాన్యాల్లో ఫైబర్ శాతం ఎక్కువగా ఉండటం వల్ల కొవ్వుని తగ్గించడంతో పాటు సుగర్, బీపీ వంటివి రాకుండా ఉంటాయి. ఊబకాయం ఉన్న వారి బరువు కూడా తగ్గుతుంది. మలబద్ధకం కూడా ఉండదు. రాగిలాంటి చిరుధాన్యాల్లో కాల్షియం వంటివి అధికంగా ఉంటాయి. ఏ వయసు వారికైనా సహస సిద్ధంగా పండే చిరుధాన్యాలు మేలు చేస్తాయి.

– డాక్టర్ కొర్ల విద్యాసాగర్, జనరల్ ఫిజీషియన్, నెఫ్రాలజిస్ట్, శ్రీకాకుళం.



స్పందనలో రాగిజావ అందిస్తున్న కలెక్టర్, డీఏఓ

నేడు స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాలకు శుభరాట



ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ఇలవేల్పు గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాలకు సోమవారం శుభరాట వేయనున్నారు. గ్రామదేవత ఉత్సవాలకు 42 కిలోమీటర్ల దూరంలో గల ఒడిశా లోని సురంగి సమీపాన శ్రీకురాసిని అమ్మవారి సన్నిధి నుంచి వెదురుగెడకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీసుకురావడం ఆనవాయితీగా వస్తోంది. దీన్ని అనుసరించి సోమవారం ఉదయం 11.40కు గ్రామదేవత ఉత్సవాల అంకురార్పణకు వేదపండితులు ముహూర్తం నిర్ణయించారు.

29, 31 తేదీల్లో ఆదిత్యుని హుండీల కానుకల లెక్కింపు

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో హుండీల కానుకల లెక్కింపు కార్యక్రమం ఈనెల 29న ఉదయం 8 గంటల నుంచి అనివెట్టి మండపంలో నిర్వహించనున్నామని ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ఓ ప్రకటనలో తెలియజేశారు. అలాగే ఈనెల 31న ఆమదాలవలస (శ్రీకాకుళం రోడ్) రైల్వే స్టేషన్‌లో ఉన్న అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి ఆలయ హుండీ కానుకల లెక్కింపును ఉదయం 8 గంటల నుంచి రైల్వే స్టేషన్ ప్రాంగణంలోనే లెక్కింపు నిర్వహిస్తున్నట్లుగా ఈఓ తెలిపారు.

న్యూస్‌రీల్

ఆదిత్యుని సన్నిధిలో ఏపీఈఆర్‌సీ చైర్మన్



ఆదిత్యుని జ్ఞాపికను జస్టిస్ నాగార్జున రెడ్డికి అందజేస్తున్న ఈఓ హరిసూర్యప్రకాష్, శంకరశర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ని ఏపీ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) చైర్‌పర్సన్ జస్టిస్ సీవీ నాగార్జున రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. స్థానిక జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానాతో కలిసి వచ్చిన ఈయనకు ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు సంప్రదాయకంగా పూర్ణకుంభ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం ఆలయ విశిష్టతను వివరించారు. అనివెట్టి మండపంలో జస్టిస్ నాగార్జున రెడ్డి బృందానికి ప్రత్యేకంగా వేదాశీర్వచనాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, ఈపీడీసీఎల్ డిస్కం డైరెక్టర్ సూర్యప్రతాప్, సర్కిల్ ఎస్ఈ ఎల్.దైవప్రసాద్, డివిజినల్ ఈఈ బయ్యన్నాయుడు, జిల్లా కోర్టు ప్రోటోకాల్ సిబ్బంది, స్థానిక విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సర్వీసుల సంఘం అధ్యక్షుడిగా శ్రీరాములు



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా రెవెన్యూ సర్వీసుల సంఘం అధ్యక్షుడిగా కె.శ్రీరాములు (పోలాకి తహసీల్దారు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెవెన్యూ సర్వీసుల సంఘం ఎన్నికలు ఆదివారం రెవెన్యూ గెస్ట్ హౌస్‌లో జరిగాయి. ఎన్నికల అధికారులుగా జి.శ్రీరామ్మూర్తి, ఎ.సూర్యనారాయణ, పరిశీలకులుగా టి.గోవిందరావు వ్యవహరించారు. ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. కార్యదర్శిగా బీవీవీఎన్ రాజు (డీటీ శ్రీకాకుళం), అసోసియేట్ అధ్యక్షుడిగా పి.శ్రీనివాసరావు(డీటీ పోలాకి), ఉపాధ్యక్షులుగా ఎస్.దిలీప్ కుమార్ (తహసీల్దారు లావేరు), ఎ.సింహాచలం (తహసీల్దారు నరసన్నపేట), మురళీధర్ నాయక్ (డీటీ ఆమదాలవలస), డి.పద్మావతి (డీటీ సరుబుజ్జిలి), ట్రెజరర్‌గా జీఎల్ఈ శ్రీనివాసరావు (డీటీ నరసన్నపేట), జాయింట్ సెక్రటరీ జి.గురుప్రసాద్ (డీటీ ఇచ్ఛాపురం), ఎస్.రాంబాబు (డీటీ పొందూరు), డి.అమరనాథ్ (డీటీ ఆమదాలవలస), జి.రామలింగేశ్వరరావు (ఏఎస్ డీఎస్ఓ కార్యాలయం), స్పోర్ట్స్ కల్చరల్ సెక్రటరీ ఐ.లింగరాజు (సీనియర్ అసిస్టెంట్ కలెక్టరేట్), కార్యవర్గ సభ్యులు సభ్యులుగా డి.శ్రీనివాసరావు, ఎం .గౌరీశంకర్‌కుమార్, జాఫర్ షరీఫ్, పి గణేష్, బి సంతోష్ కుమార్, బి శ్రీనివాసరావు, పి.కృష్ణకాంత్‌లు ఎన్నిక య్యారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



కవిటి రామరాజు

కోటబొమ్మాళి: ఇప్పటివరకూ జిల్లాలోని 1,22,454 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి ఆదుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రైతుల తరఫున కృతజ్ఞతలు చెబుతున్నామని రైతు సమాఖ్య జిల్లా కమిటీ సభ్యుడు కవిటి రామరాజు పేర్కొన్నారు. ఆయన ఆదివారం కోటబొమ్మాళి మండల పరిషత్ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా లక్షా యాభైవేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా రైతుల నుంచి సేకరించారని, వారికి రవాణా ఖర్చులు కూడా అందజేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి మాత్రమేనని అన్నారు. రైతు భరోసా కూడా అందిస్తూ ఆదుకుంటున్నారని తెలిపారు.

అవినీతిలో చంద్రబాబు నైపుణ్యం చూపించారు

- స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ పేరుతో సొంత ఖాతాకు రూ.371 కోట్లు
- అమరావతి నిర్మాణంలోనూ రూ.వేల కోట్లు అవినీతి
- మరి కొద్ది రోజుల్లోనే చంద్రబాబుకు జైలు జీవితం
- మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: టీడీపీ హయాంలో నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందజేస్తామని చెప్పి.. స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ప్రాజెక్టు పేరుతో చంద్రబాబు రూ.371 కోట్లు తన సొంత ఖాతాకు మళ్లించుకుని అవినీతిలో నైపుణ్యత ప్రదర్శించారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ దుయ్యబట్టారు. ఆయన టెక్కలిలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. నైపుణ్యత శిక్షణ ప్రాజెక్టు కోసం అప్పట్లో సీమెన్స్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని ప్రభుత్వ వాటాగా రూ.371 కోట్లను ముందుగా విడుదల చేసి ఆ మొత్తాన్ని చంద్రబాబు తన సొంత ఖాతాకు మళ్లించుకున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు చేసిన అవినీతిపై సీఐడీ, ఇంటెలిజెన్స్, జీఎస్టీ, ఈడీ తదితర దర్యాప్తు విభాగాలు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నాయని వెల్లడించారు. ఇప్పటికే నలుగురిని అరెస్టు చేశారని, మరి కొద్ది రోజుల్లో చంద్రబాబు జైలుకు వెళ్లడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. అంతే కాకుండా అమరావతి నిర్మాణంలో భాగంగా చదరపు అడుగు రూ.12 వేలకు అంచనా వేస్తూ బిల్లుల మంజూరు కోసం ఎల్ అండ్ టీ, షాపూర్జి, పల్లోంజి కంపెనీల నుంచి రూ.145 కోట్లు లంచం తీసుకున్నారని ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు సంపాదించిన డబ్బుతో ఇప్పుడు ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తున్నారని చంద్రబాబుపై మండిపడ్డారు. చంద్రబాబుకు ఏనాడూ నేరుగా ఎన్నికలకు వెళ్లే సత్తా లేదని విమర్శించారు. అడ్డదారుల్లో రాజకీయాలు చేసే నీచానికి దిగుతున్నారని వ్యాఖ్యానించారు. తాజాగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్రకు సంబంధించి మొదటి ప్రాధాన్యతగా వైఎస్సార్ సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు 55 వేల ఓట్లు వచ్చాయని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి అసెంబ్లీ స్థాయి వరకు వందశాతం వైఎస్సార్‌సీపీ బలంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో విజయం సాధిస్తామంటూ చంద్రబాబు పగటి కలలు కంటున్నారని చురకలు అంటించారు. వైఎస్సార్‌సీపీలో తప్పు చేస్తే ఎమ్మెల్యేలను సైతం పక్కన పెట్టే నిజాయితీ తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉందని, అదే ధైర్యం, నిజాయితీ చంద్రబాబుకు ఉందా అని దువ్వాడ ప్రశ్నించారు. టెక్కలి నియోజకవర్గంలో కేవలం సరదాలు, సంబరాలు తప్ప ప్రజల సమస్యల కోసం ఏనాడైనా అచ్చెన్నాయుడు పట్టించుకున్నారా అని నిలదీశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేస్తున్న మంచిని ఎల్లో మీడియా, చంద్రబాబు, అచ్చెన్న కలిసి దుష్ప్రచారం చేస్తున్నారని, ఇలాంటి నీచ సంస్కృతిని ప్రజలు తిప్పి కొడతారని దువ్వాడ హెచ్చరించారు.

ఉపాధి కోర్సుల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో 13 రోజుల పాటు నిర్వహించనున్న సీసీటీవీ కెమెరా, ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ కె.శ్రీనివాసరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి అర్హత ఉండి, 19 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారు అర్హులని తెలిపారు. శిక్షణ కాలంలో భోజన, వసతులు ఉచితమని చెప్పారు. అర్హులైన వారు 7993340407, 9553410809 నంబర్లను సంప్రదించాలని, దరఖాస్తుల సంఖ్య బట్టి బ్యాచ్ ప్రారంభిస్తామని అన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



ఇందిరమ్మ కాలనీలో కుక్కల దాడిలో మృతి చెందిన చుక్కల జింక

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో కుక్కలు దాడి చేయడంతో ఒక జింక మృతి చెందింది. ఆదివారం సాయంత్రం జోగి కొండ నుంచి ఇందిరమ్మ కాలనీలోకి చుక్కల జింక రావడంతో కుక్కలు చూసి వెంటాడి దాడిచేశాయి. జింక తీవ్రంగా గాయపడింది. స్థానిక యువకులు వెళ్లి చూసేసరికే చనిపోయింది. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అక్కడకు ఫారెస్ట్ సిబ్బంది చేరుకుని మృతి చెందిన జింకను తమ కార్యాలయానికి తీసుకువెళ్లారు. ఆదివారం రాత్రి అయిపోవడంతో సోమవారం ఉదయం పోస్టుమార్టం చేసి, అనంతరం అటవీ శాఖ కార్యాలయం ఆవరణలో దహనం చేస్తామన్నారు.

కోవిడ్‌లో ఆగిపోయిన ఆర్టీసీ సర్వీసుల పునరుద్ధరణ

శ్రీకాకుళం అర్బన్: కరోనా సమయంలో నిలిచిపోయిన రెండు ఆర్టీసీ సర్వీసులను ఆదివారం నుంచి పునరుద్ధరించినట్లు శ్రీకాకుళం రెండో డిపో మేనేజర్ శర్మ తెలిపారు. పలాస నుంచి బయల్దేరే బస్సులు టెక్కలి, నరసన్నపేట, రామలక్ష్మణ జంక్షన్, సూర్య మహల్, అరసవల్లి జంక్షన్, పాత బస్టాండ్, 7 రోడ్ల జంక్షన్, డే–నైట్ మీదుగా శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరతాయని డిపో మేనేజర్ శర్మ తెలిపారు. ఈ విధంగా పలాస నుంచి ఒక బస్, శ్రీకాకుళం 2వ డిపో నుంచి ఒక బస్సు ఉదయం, సాయంత్రం నడుస్తాయని పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సీతారాముల కల్యాణం చూసొద్దాం రారండి

- భద్రాచలం సీతారాముల కల్యాణం చూసే భక్తులకు ఆర్టీసీ తీపి కబురు
- శ్రీకాకుళం, పలాస నుంచి ప్రత్యేక బస్ సర్వీసులు ఏర్పాటు
- సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజారవాణా అధికారి పిలుపు



భద్రాచలం ప్రత్యేక బస్సు సర్వీసుల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రజారవాణా అధికారి



శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణికులకు శుభవార్త చెప్పింది. భద్రాచలంలో కన్నులపండువగా నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవానికి హాజరయ్యే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును ఏర్పా టు చేసింది. శ్రీకాకుళం డిపో నుంచి స్పెషల్ సూపర్ లగ్జరీ బస్ సర్వీసు ఈ నెల 29వ తేదీన భక్తులకు అందుబాటులో ఉంచుతున్నారు. శ్రీకాకుళం బస్ స్టేషన్ నుంచి 29న సాయంత్రం 5.30 గంటలకు బస్సు బయల్దేరి 30వ తేదీ ఉదయం 6 గంటలకు భద్రాచలం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో భాగంగా 30వ తేదీన సాయంత్రం 6 గంటలకు భద్రాచలంలో బయలుదేరి.. మరుసటి రోజు(31వ తేదీ) ఉదయం 6.30 గంటలకు శ్రీకాకుళం చేరుకుంటుంది. శ్రీకాకుళం నుంచి ఒకవైపు చార్జీగా రూ.990గా అధికారులు నిర్ణయించారు. ఈ నెల 29వ తేదీన పలాస నుంచి మధ్యాహ్నం 2.30 గంటలకు అల్ట్రా డీలక్స్ బస్సు ఏర్పాటు చేశారు. దీని టిక్కెట్ ధర మనిషికి రూ.1050గా నిర్ణయించారు.

40 మంది ఉంటే ప్రత్యేక బస్సు..

ఏదైనా గ్రామం నుంచి 40 మందికి మించి భద్రాచలం వెళ్లాలని అనుకునే భక్తులు ఉంటే వారి గ్రామం నుంచే నేరుగా స్పెషల్ బస్సును ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ సౌకర్యం కోసం భక్తులు సంబంధి త డిపో మేనేజర్‌ను సంప్రదించవచ్చు.

ముందే బుక్ చేసుకోవచ్చు..

ప్రత్యేక సర్వీసులకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఆర్టీసీఆన్‌లైన్.ఇన్ అనే వెబ్‌పోర్టల్‌లో ముందుగా సీట్లు రిజర్వేషన్ చేయించుకొనే సౌకర్యం కూడా అధికారులు కల్పిస్తున్నారు. అలాగే శ్రీకాకుళం బస్ స్టేషన్‌లో గల రిజర్వేషన్ కౌంటర్లో కూడా టిక్కెట్లు లభ్యమయ్యేలా ప్రత్యేకకౌంటర్‌ను ఏర్పాటు చేశారు. వివరాలకు 7382921763, 7382921647, 7382924758 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

భక్తులు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలో భక్తుల కోసం ఆర్టీసీ ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. భద్రాచలం సీతారాముల కల్యాణానికి హాజరయ్యే భక్తుల కోసం రాష్ట్ర రోడ్డురవాణా సంస్థ ద్వారా ప్రత్యేక బస్సు సదుపాయాలను కల్పిస్తున్నాం. అందుబాటులో ఉండే చార్జీలతోనే రాకపోకలు సాగించవచ్చు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలి.

– విజయ్‌కుమార్, జిల్లా ప్రజారవాణా అధికారి, శ్రీకాకుళం

శ్రీరామ నవమి ఉత్సవాలకు అంకురార్పణ



విద్యుత్ దీపాలంకరణతో మెరిసిపోతున్న వీధులు

జిల్లాలో అతి పెద్ద మత్స్యకార గ్రామం సువ్వలరేవులో ఆదివారం శ్రీరామ నవమి ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆదివారం దాసుడి ఇంటి నుంచి దేవరను మేళతాళాల నడుమ ఊరేగింపుగా శకురాణి(అమ్మవారు)కి సమర్పించి జెండాను ఆవిష్కరించారు. అలాగే గ్రామంలో ఉన్న 13 అమ్మవార్లకు చల్లదనం చేశారు. అమ్మవారి ప్రతిమలను ఉత్సవాల్లో ప్రతి రోజు రాత్రి ఊరేగించేందుకు సిద్ధం చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు ఆకట్టుకుంటున్నాయి.

– వజ్రపుకొత్తూరు రూరల్

ఆలోచింపజేసిన నాటికలు



అతీతం నాటిక దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: సుమిత్రా కళాసమితి, శ్రీసూర్యనారాయణస్వామి దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో అరసవల్లిలోని వైజయంతి ఉత్సవ వేదికపై ఆదివారం ప్రదర్శించిన మూడు నాటికలు అలరించాయి. అభియన ఆర్ట్స్ గుంటూరు ఆధ్వర్యంలో 'అతీతం' నాటిక అందరినీ ఆలోచింపజేసింది. నేటి ప్రపంచీకరణలో భారతీయ కుటుంబ వ్యవస్థ దెబ్బ తింటోందనే అంశంపై ప్రదర్శించిన నాటికకు కథను రామచంద్రమౌళి అందించగా నాటకీకరణ శిష్ట చంద్రశేఖర్, దర్శకత్వం ఎస్.రవీంద్రరెడ్డి వహించారు. హైదరాబాద్, భూమిక థియేటర్ గ్రూప్ ప్రెజెంట్స్ వారి 'బరిబత్తుల రాజు' నాటికలో రాజుల కాలం నాటి కథను అంశంగా తీసుకొని ప్రదర్శించారు. దీనికి దర్శకత్వం రాజీవ్ రంజన్ వహించారు. చిలకలూరి పేట, ముద్దుకూరి ఆర్ట్స్ క్రియేషన్స్ వారి 'మృత్యుపత్రం' నాటికలో.. చనిపోయిన మనిషి శవంతో ఆస్పత్రి డాక్టర్, సిబ్బంది, పోలీసులు, ఆఖరకు ఆటో డ్రైవర్ కూడా ఒక పల్లెటూరి నుంచి వచ్చిన మహిళ వద్ద వసూలు చేస్తారు. చివరకు ఆ బిడ్డ తన కూతురని ఆటోడ్రైవర్‌కు తెలుస్తుంది. హృద్యంగా సాగే ఈ నాటిక బంధాల గురించి వివరిస్తుంది. ఈ నాటికకు రచన, దర్శకత్వం మద్దుకూరి రవీంద్ర బాబు.

కార్యక్రమంలో కళాసమితి అధ్యక్ష, కార్యదర్శులు ఇప్పిలి శంకరశర్మ, గుత్తు చిన్నారావు, నక్క శంఖరరావు, మండవిల్లి రవి, కిల్లాన ఫల్గుణరావు, డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, వివిఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



బరిబత్తుల రాజు నాటికలో ఓ సన్నివేశం

క్లుప్తంగా

1న వీర గున్నమ్మ వర్ధంతి సభ


వీరగున్నమ్మ వర్ధంతి సభ కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

మందస: బ్రిటిష్ పాలకులపై కత్తి దూసిన వీర గున్నమ్మ వర్ధంతిని ఏప్రిల్ 1న మందస బస్టాండ్‌లో నిర్వహిస్తున్నట్టు రైతు సంఘం, సీఐటీయూ నాయకులు ప్రకటించారు. ఈ మేరకు మందస పట్టణంలో ఆదివారం వీరగున్నమ్మ వర్ధంతి సభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ సంఘాల ఆధ్వర్యంలో మందస బస్టాండ్‌లో బహిరంగ సభను నిర్వహిస్తున్నామన్నారు. మాజీ ఎంపీ మధుతో పాటు ప్రజాసంఘాలు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొంటాయన్నారు. ఇదే మండలంలోని వీరగున్నమ్మపురం గ్రామానికి చెందిన శాసుమాన గున్నమ్మ.. బ్రిటిష్ తూటాలకు బలై 83 ఏళ్లు కావస్తోందన్నారు. వీరగున్నమ్మ వర్ధంతి సభను విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కోనారి మోహనరావు, మట్ట ధర్మారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.గణపతి, సీఐటీయూ నాయకులు ఆర్.దిలీప్‌కుమార్, కె.కేశవరావు, ఎస్.వల్లభరావు, సీహెచ్ గణేష్, గిరిజన సంఘం నాయకులు ఎస్.గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

'ఒడియా బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి'


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ఒడియా లింగ్విస్టిక్ మైనార్టీ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ పాఢి

కంచిలి: ఉత్తరాంధ్ర జిల్లాల్లో గల ప్రభుత్వ ఒడియా పాఠశాలల్లో రానున్న విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల సంఖ్య పెంచడానికి కృషి చేయాలని ఏపీ ఒడియా లింగ్విస్టిక్ మైనార్టీ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ పాఢి పిలుపునిచ్చారు. కంచిలి ప్రాథమిక పాఠశాల ఆవరణలో సత్యనారాయణ పాఢి అధ్యక్షతన ఉత్కళ సమ్మిళినీ విద్యా వలంటీర్ల సమావేశం ఆదివారం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో ఒడియా భాష సాహిత్యం, సంస్కృతి వికాసానికి ఉత్తరాంధ్ర జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ఒడిశా ప్రభుత్వం నియమించిన విద్యా వలంటీర్లను ఉద్దేశించి సత్యనారాయణపాఢి మాట్లాడారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో గల 120 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత, 32 ఉన్నత ఒడియా పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఒడియా ఉపాధ్యాయ పోస్టుల స్థానంలో 130 మంది విద్యా వలంటీర్లు పనిచేస్తున్నారని వెల్లడించారు. ప్రభుత్వ, గిరిజన పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అన్ని ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను కలిసి మాట్లాడుతామని తెలిపారు. విద్యావలంటీర్ల జీతాల మంజూరు కోసం ఒడిశా ప్రభుత్వంతో మాట్లాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉత్తరాంధ్ర ఒడియా డీఐ దుర్గాప్రసాద్ చౌదురీ మాట్లాడుతూ విద్యార్థుల నోటు పుస్తకాలు, వర్క్ బుక్స్ హోమ్ వర్క్స్ ప్రతిరోజూ సరిదిద్దాలని, పాఠ్య ప్రణాళిక, టీచర్స్ డైరీ రాయాలని, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌తో విద్యా బోధన చేయాలని సూచించారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

హిరమండలం: జాతీయ స్థాయిలో జరగనున్న కుస్తీ పోటీలకు జిల్లా నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. ఇటీవల నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు టి.సింహాచలం, సోనియా, చామంతి మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయ పోటీలకు అర్హత సాధించారు. వీరికి పలువురు అభినందనలు తెలిపారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	56,150–00
బంగారం(22కి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215

ఆర్తులకు ఆప్తులు

- సమాజానికి సేవ చేస్తున్న సిక్కోలు ఉద్దానం సేవా సమితి
- నిరుపేదల కోసం ఉచిత అంబులెన్స్‌లు
- వాట్సాప్ వేదికగా ఒక్కటై సేవల నిర్వహణ


ప్రాణాపాయస్థితిలో ఉన్న వ్యక్తికి సాయం చేస్తున్న సభ్యులు


రెండు అంబులెన్సులతో ఎస్‌వీఎస్‌ఎస్ సభ్యులు

కాశీబుగ్గ: ఎక్కడెక్కడి వారో ఒక్కటయ్యారు. వాట్సాప్ వేదికగా తమ మనోభావాలను పంచుకున్నారు. జీవితంలో చక్కగా స్థిరపడిన వారంతా తోటి వారికి సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా సేవా సమితి పెట్టి చక్కటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సుమారు 750 మంది సభ్యులు 2019 నుంచి వాట్సాప్ వేదికగా ఒక్కటై 'సిక్కోలు ఉద్దాన సేవా సమితి' పేరున అపురూపమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రక్తదానాలు, ఉచిత భోజన సరఫరా, ఆపదలో ఉన్నవారిక ఆర్థిక సాయం వంటి కార్యక్రమాలు చేస్తూ నేడు ఇంకోమెట్టు ఎక్కి ఉచిత అంబులెన్స్ సేవలను మొదలుపెట్టారు.

సేవలు ఉచితంగానే..

ఆంధ్రా ఒడిశా బోర్డర్‌లో ఉన్న చాలా గ్రామాలకు నెట్‌వర్క్ సమస్య ఉంటుంది. ఇక్కడ ఉంటున్న వారు అంబులెన్స్‌ను కాంటాక్ట్ చేయడం చాలా సమయాల్లో కుదరడం లేదు. ఇలాంటి వారి కోసం ప్రత్యేకంగా ఒక అంబులెన్స్ ఉంటే బాగుంటుందని సేవా సమితి సభ్యులు ఉచిత అంబులెన్స్ సేవలు మొదలుపెట్టారు. ఈ సమితిలో ఆర్మీలో పనిచేస్తున్న వారు ఎక్కువగా ఉన్నారు. ఆస్పత్రుల నుంచి మృతదేహాలను నిరుపేదల ఇళ్లకు తరలించడానికి, అవసరమైన వారికి అత్యవసర సమయాల్లో ఇవ్వడానికి అంబులెన్స్‌ను చందాలు వేసుకుని మరీ సమకూర్చారు. ఇండియన్ ఆర్మీలో ఉన్న అనేక మంది సైనికులు, ఉద్యోగులు, నాయకులు, పెద్దలు, మహిళలు, యువత నెలకు ఒక్కరు రూ.100 చొప్పున చందాలు వేసుకోగా.. మరికొంతమంది భారీ విరాళాలు అందించడం, కొందరు సైనికులు నెల జీతాలను కూడా ఇవ్వడంతో రూ.50 లక్షలు సమకూరింది. ఇప్పటికే రెండు అంబులెన్సులను కొనుగోలు చేశారు. ఇంకా చాలా సేవలు చేస్తున్నారు. ఈ అంబులెన్స్‌లలో ఒక వాహనాన్ని ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి, పలాస ప్రాంతాలకు కేటాయించారు. మరొకదాన్ని టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, మెళియాపుట్టి మండలాలకు కేటాయించారు. ఏప్రిల్ 26న శ్రీకాకుళంలో రిమ్స్, కిమ్స్ వంటివాటికి అందుబాటులో ఓ అంబులెన్సును ఉంచి అక్కడి నుంచి ఈ ప్రాంతాలకు రావాల్సిన నిరుపేదల మృతదేహాలను ఉచితంగా తరలించనున్నారు.

నిరుపేదల కోసమే..



మా ఉద్దాన ప్రాంతంలో ఉన్న మారుమూల గ్రామాలకు సెల్‌సిగ్నల్ అందక ఇబ్బందులు పడుతున్నారు. 108కు సమాచారం అందని గ్రామాల్లో అనేకమంది నిరుపేదలు చనిపోయారు కూడా. అందుకే మేమంతా వాట్సాప్ గ్రూప్ పెట్టుకుని సేవ చేయడానికి సిద్ధమయ్యాం. మా జీతాలతో పాటు అనేక మంది అందించిన ఆర్థిక సహకారంతో సాయం చేస్తున్నాం. గ్రూప్ సభ్యుల సహకారంతో ఏడాదికి ఏడాది కొత్త సేవలు అందిస్తున్నాం, 2019లో రక్తదానం ప్రారంభించాం, అనంతరం ఉచిత భోజనాలు పంపిణీ, ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సాయం, నేడు అత్యవసర పరిస్థితిలో ఉన్నవారి అంబులెన్సు ప్రారంభించాం. పేదలు మృతదేహాలను తరలించడానికి వీలుగా మేం అంబులెన్స్ సమకూరుస్తాం.

– తలగాన తారకేశ్వరరావు, ఇండియన్ ఆర్మీ జవాన్, సువర్ణపురం, మందస మండలం

జాతీయ పోటీలకు పయనం


జాతీయ పోటీకు పయనమైన క్రీడాకారుల బృందంతో ఒలింపిక్, తైక్వాండో సంఘ జిల్లా ప్రతినిధులు, కోచ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించాలని ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి పిలుపునిచ్చారు. రాజస్థాన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ కోట స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు 36వ సబ్‌జూనియర్స్, కేడెట్ బాలబాలికల తైక్వాండో చాంపియన్‌షిప్–2022–23 పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు ఆదివారం ఇక్కడ నుంచి పయనమై వెళ్లారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ ప్రధాన కార్యదర్శి కొమర భాస్కరరావు అధ్యక్షతన జరిగిన ఈ వీడ్కోలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సాంబమూర్తి మాట్లాడుతూ సిక్కోలు ఖ్యాతిని చాటి చెప్పాలని కోరారు. కొమర భాస్కర్ మాట్లాడుతూ జాతీయ పోటీల్లో పతకాలు సాధించే జిల్లాలో అడుగుపెడతామని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ముఖ్య సలహాదారులు పి.సుందరరావు మాస్టారు, జిల్లా ఉషూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి శివకుమార్, కురిటి తారకరామ, రెడ్డి సాయికుమార్, కొమర మోహన్ కృష్ణ, రుప్ప చంద్రశేఖరరావు, చంగల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా జట్టుకు కోచ్‌గా కొమర



రాజస్థాన్‌లో ఈనెల 28 నుంచి జరిగే జాతీయ తైక్వాండో పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడాకారులు బృందానికి హెడ్ కోచ్‌గా కొమర భాస్కరరావు నియామకమయ్యారు. ఈ మేరకు న్యూ ఏపీ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.అచ్యుతరెడ్డి నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు.

జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు వీరే..

ఈనెల 10 నుంచి 12 వరకు విశాఖపట్నం జిల్లా యలమంచిలి వేదికగా జరిగిన రాష్ట్ర పోటీల్లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులంతా జాతీయ పోటీలకు నేరుగా ఎంపికయ్యారు. సబ్ జూనియర్స్ బాలికల విభాగంలో అండర్–16 బరువు కేటగిరిలో దువ్వు త్రివేణి, అండర్–26 బరువు కేటగిరిలో పెద్దిన యషిత, కేడెట్ బాలుర అండర్–33 బరువు విభాగంలో ఆకుల ప్రశాంత్, అండర్–37 బరువు కేటగిరిలో టి.ఢిల్లీశ్వరరావు, అండర్–45 బరువు కేటగిరిలో జి.హిమచందన్, అండర్–57 బరువు కేటగిరిలో జి.రిత్విక్‌లోకేష్ ఆరుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు.

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం


మాట్లాడుతున్న ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

కాశీబుగ్గ: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ శ్రీకాకుళం జిల్లా 17వ వార్డు కౌన్సిల్ సమావేశం కాశీబుగ్గ రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని అన్నారు. ముందుగా జాతీయ పతాకాన్ని ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ పతాకాన్ని జిల్లా అధ్యక్షుడు పి.అప్పారావు, ఎస్టీఎఫ్ఐ పతాకాన్ని రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర ఎగురవేశారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ ప్రసంగిస్తూ యూటీఎఫ్, ఇతర ఉపాధ్యాయ విద్యార్థి సంఘాలు ఐక్యంగా విద్యారంగ సమస్యలపై పోరాటం చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర మాట్లాడుతూ ప్రభుత్వాలు ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను విడనాడాలని లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షుడు పొందూరు అప్పారావు అధ్యక్షతన జరిగింది.

అరసవల్లి కిటకిట


సూర్యనమస్కారాల పూజలు చేయించుకుంటున్న భక్తులు

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామిని ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఈ క్షేత్రానికి తరలిరావడంతో ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ఆధ్వర్యంలో భక్తుల దర్శనాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. అయితే ఆదివారం భానుడి తీవ్రత అధికంగా ఉండడంతో ఒకింత ఇక్కట్లు పడ్డారు. ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఆదిత్యుని మూర్తికి ప్రత్యేక అలంకరణ చేసి ఉదయం 6 గంటల నుంచి సర్వదర్శనాలకు అనుమతిచ్చారు. వివిధ టిక్కెట్ల ద్వారా దర్శనాలకు, అలాగే ఆలయంలోపల మండపాల్లో ప్రత్యేక సూర్యనమస్కార పూజలకు ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తగిన చర్యలు చేపట్టారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆదివారం ఎలాంటి ఆర్జిత సేవలను నిర్వహించలేదు. ఇక ఆదివారం ఒక్కరోజున దర్శనాల టిక్కెట్ల ద్వారా రూ.2.24 లక్షలు, విరాళాల ద్వారా రూ.74,186, ప్రసాదాల రూపంలో రూ.2.10 లక్షల వరకు ఆదాయం లభించిందని ఈఓ హరిసూర్యప్రకాష్ తెలియజేశారు. ఆదిత్యుడిని జిల్లా విజిలెన్స్ విభాగ ఎస్పీ ఎ.సురేష్‌బాబు, టెక్కలి జెడ్పీటీసీ దువ్వాడ వాణి తదితరులు స్వామిని దర్శించుకున్నారు.

కొట్లాటపై కేసు నమోదు

రణస్థలం: మండలంలోని కొచ్చెర్ల గ్రామంలో ముగ్గురు వ్యక్తులు గొడవ పడగా.. దీనిపై పోలీసు కేసు నమోదైందని ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు. గ్రామానికి చెందిన బన్న గౌరీశంకర్, దారపు నీలయ్య, తాత అనే వ్యక్తుల మధ్య రహదారి సమస్య నలుగుతోంది. ఏడాదిగా దీనిపై వారు గొడవ పడుతున్నారు. ఆదివారం ముగ్గురి మధ్య మాటలు ముదిరి ఘర్షణ జరిగింది.

ఈ గొడవలో గౌరీశంకర్ అనే వ్యక్తి నీలయ్య, తాతలను తీవ్రంగా కొట్టి గాయపరిచాడు. వీరిని శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు.

తూర్పుకాపు భవన నిర్మాణమే లక్ష్యం


సమావేశంలో పాల్గొన్న తూర్పుకాపు సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): తూర్పుకాపు భవన నిర్మాణమే లక్ష్యంగా తూర్పు కాపులంతా ఐకమత్యంతో ముందుకు సాగాలని తూర్పుకాపు ముఖ్య నాయకులు డోల తిరులరావు, డోల జగన్, సురంగి మోహనరావు, ఆనెపు రామకృష్ణ, ఎంపీ స్వరూప్, కలిశెట్టి అప్పలనాయుడు, ఇజ్జాడ శివన్నారాయణ, లంక గాంధీలతో కూడిన కమిటీ పిలుపునిచ్చింది. శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో తూర్పుకాపు ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నిర్మించనున్న తూర్పుకాపుల సంక్షేమ భవనం రాష్ట్రానికే తలమానికమవ్వాలని కోరారు. శ్రీకాకుళం నగర పరిసరాల్లో స్థలాన్ని సేకరించి డిసెంబరు నాటికి పునాదులు వేసి నిర్మాణం చేపట్టాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. అలాగే తూర్పుకాపులు భవిష్యత్‌లో సామాజిక, రాజకీయంగా, ఆర్థికంగా ఉన్నతంగా ఎదిగేందుకు చైతన్యం కావాల్సిన అవసరం ఉందన్నారు.

భవన నిర్మాణ నూతన కార్యవర్గం ఎన్నిక

భవన నిర్మాణానికి నూతన కమిటీ అధ్యక్షుడిగా సురంగి మోహనరావు, ఉపాధ్యక్షుడిగా ఇజ్జాడ శివన్నారాయణమూర్తి, సెక్రటరీగా లంక వెంకటప్పలనాయుడు (గాంధీ), జాయింట్ సెక్రటరీ అలుగుబిల్లి నాగభూషణరావు, కోశాధికారిగా శాసపు జోగినాయుడు, మెంబర్లుగా డోల జగన్,మోహనరావు, ఎల్.వి రాజశేఖర్, వి. శ్రీరాములు, పిసిని చంద్రమోహన్, గేదెల వాసుదేవరావు, పి.మాధవి తదితరులను ఎన్నుకున్నారు. నిధుల సేకరణకు మండలాల వారీగా పర్యటించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు.

ఈ కార్యక్రమంలో తూర్పుకాపు సంఘ ప్రతినిధులు ఎస్.కె నాయుడు, రాడ కైలాషరావు, గొర్లె వెంకటరమణ, వాన కృష్ణచంద్, కొమరాపు అఫీస్ నాయుడు, పడాల తమ్మినాయుడు, తూర్పు ఉద్యోగుల సంక్షేమ సంఘ ప్రధాన బాధ్యులు కిలారి నారాయణరావు, అంకడాల తవిటన్న, రౌతు గోపి, వి. సన్యాసినాయుడు, అల్లు యుగంధర్, చక్రపాణి, టంకాల శ్రీనివాస్,రాజు, మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య


మృతురాలు లక్ష్మి (ఫైల్)

నరసన్నపేట: నరసన్నపేట గాంధీనగర్‌కు చెందిన కరుకోల లక్ష్మి(48) అనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడ్డారు. అద్దెకు ఉంటున్న ఇంటిలో నైలాన్ తాడుతో ఉరి వేసుకున్నారు. భర్త నారాయణ మూర్తి వేధింపులకు తాళలేక ఆమె బలవన్మరణానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మి, నారాయణమూర్తిలకు ముప్పై ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరంతా ఉద్యోగాల రీత్యా వేరే ప్రాంతాల్లో ఉంటున్నా రు. ఇంట్లో దంపతులిద్దరూ నివాసముంటున్నారు. నారాయణమూర్తి లక్ష్మిని వేధింపులకు గురిచేసేవాడని, నిత్యం కొట్టేవాడని లక్ష్మి సోదరి ఆదెమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతను బయటకు వెళ్లినప్పుడల్లా ఇంటికి రెండు వైపులా తాళాలు వేసి వెళ్తారని, శనివారం ఉదయం కూడా ఆయన బయటకు వెళ్తూ ఇంటికి తాళాలు వేసి వెళ్లారని, సాయంత్రం తిరిగి వచ్చే సరికి లక్ష్మి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించిందని తమకు చెప్పడంతో వచ్చి చూశామని ఆదెమ్మ తెలిపారు.

పోలీసులకు సమాచారం అందడంతో వారు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించారు. ఆదెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసన్నపేట ఎస్ఐ వై. సింహాచలం ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పనస పసందు

పనస రైతుల పంట పండింది. పనస కాయలు గుత్తులు గుత్తులుగా కాయడంతో పాటు మంచి ధర కూడా లభిస్తోంది. ఉద్దానం గోపినాథపురంలోని రైతు కర్ని వల్లయ్య కొబ్బరితోటలో అంతర పంటగా పండిస్తున్న పనస చెట్టుకు ఇలా 168 కాయలు కాశాయి.

–వజ్రపుకొత్తూరు

రైలు ఢీకొని యువకుడు మృతి


రైలు ఢీకొని మృతిచెందిన యశ్వంత్

టెక్కలి రూరల్: మండలంలోని నౌపడ రైల్వేగేటు సమీపంలో ఆదివారం విశాఖ ఎక్స్‌ప్రెస్ కొని రావివలస పంచాయతీ పరిధి చిన్నానారాయణపురం గ్రామానికి చెందిన మురపాల యశ్వంత్(18) అనే యువకుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన యశ్వంత్ ఆదివారం మధ్యాహ్నం సమయంలో నౌపడ రైల్వేగేటుకు కూతవేటు దూరంలో ట్రాక్ దాటుతుండగా అదే సమయంలో అటుగా వచ్చిన విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ప్రమాదాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పలాస జీఆర్పీ ఎస్ఐ ఎస్కే షరీఫ్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడికి తండ్రి గవరయ్య, తల్లి అమ్మలమ్మ, అన్నయ్య గణపతి ఉన్నారు. ఇది ప్రమాదమా.. ఆత్మహత్యా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

రాహుల్‌పై అనర్హత వేటు అప్రజాస్వామికం

శ్రీకాకుళం: ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడం సబబు కాదని, అప్రజాస్వామిక విధానాలను తామంతా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నామని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రెల్ల సురేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాని మోదీ ఇంటి పేరుపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న అభియోగం దృష్ట్యా నమోదైన కేసుకు సంబంధించి సూరత్ కోర్టు విధించిన రెండేళ్ల జైలు శిక్షకు సంబంధించిన ఇంకా ఏ విషయం కొలిక్కి రాక మునుపే, రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తామంతా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు.

అర్ధ శతాబ్దం తర్వాత..


పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

సారవకోట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1973–74 సంవత్సరంలో టెన్త్ చదివిన విద్యార్థులు ఆదివారం ఒకే వేదికపై కలిశారు. ఈ సందర్భంగా ఆనాడు పాఠాలు చెప్పిన గురువులు శిమ్మ జగన్నాథరావు, జి.అప్పారావు, శ్రీరాముల నాయుడులను సన్మానించారు.